
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్
కోనసీమ
జిల్లా వార్తలు
శుక్రవారం 26 జూలై 2024 | 5





గోదావరి తగ్గుముఖం
ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ
7లో



అంబాజీపేట: వాకలగరువులో ఒడ్డున ఉన్న పడవలు, దోనెలు



ఆత్రేయపురం: వెలిచేరులో వరద నీటిలో అరటి పంట



కపిలేశ్వరపురం: కోరుమిల్లి శివారులో కోతకు గురైన చోట ఇసుక బస్తాలు



ఆలమూరు వద్ద వరద ఉధృతి



అంతర్వేది: టేకుశెట్టి పాలెం నుంచి పెదలంకకు పడవపై వెళుతున్న గ్రామస్థులు



ఆలమూరు మండలం జొన్నాడ వద్ద వరదనీటిలో అరటితోట



ముమ్మిడివరం: గురజాపులంకలో నీటితో నిండిన రోడ్డుపై రాకపోకలు



పి.గన్నవరం: మానేపల్లి శివారులో



ముమ్మిడివరం: గురజాపులంకలో ముంపులో పచ్చిమిర్చి తోట

చుట్టూ నీళ్లు..

కొనసాగుతున్న వరద ఉధృతి

ముంపులోనే పొలాలు
లంక గ్రామాలకు ఆహారం, తాగునీరు సరఫరా
జిల్లాలో పర్యటించిన కలెక్టర్, జేసీలు
పొలాల పరిశీలన

అమలాపురం, జూలై 25(ఆంధ్రజ్యోతి): గోదావరి వరద ఉధృతి కోనసీమ జిల్లాలో కొనసాగుతోంది. మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మళ్లీ భద్రాచలంలో వరద ప్రవాహం పెరుగుతోంది. ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరించినప్పటికీ కోనసీమలోని వశిష్ఠ, వైనతేయ, గౌతమీ, వృద్ధగౌతమీ నదీ పాయల్లో వరద తీవ్రత కొనసాగుతూనే ఉంది. సమీపంలోని లంక గ్రామాలు ముంపునకు గురయ్యాయి. వరద ముంపు ప్రాంతాల్లో కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి విస్తృతంగా పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల పరిధిలోని వరద ముంపునకు గురైన ప్రాంతాలను జేసీ నిషాంతి పరిశీలించి బాధితులను పరామర్శించారు. కాజ్‌వేల వద్ద పరిస్థితిని సమీక్షించారు. ట్రాక్టర్లపై లంక గ్రామాలకు వెళ్లి అక్కడ బాధితులతో మాట్లాడారు. కలెక్టర్ కోనసీమ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వేల ఎకరాల భూములు వర్షపు నీటితో మునిగిపోవడం వల్ల రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో కూనవరం స్ట్రెయిట్ కట్ వద్దకు కలెక్టర్ ఇరిగేషన్, డ్రైనేజీ అధికారులతో వెళ్లి అక్కడి పరిస్థితిని సమీక్షించారు. ఒక వర్గం రైతులు స్ట్రయిట్‌కట్‌ను పునరుద్ధరించాలని, మరోవర్గం రైతులు ఆ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కలెక్టర్ సమక్షంలోనే పరస్పరం వాదులాడుకున్నారు. ఒకవైపు వరద మరోవైపు ప్రధానమైన డ్రెయిన్లు పొంగి ప్రవహించడంతో జిల్లా పరిధిలోని వేల ఎకరాల భూముల్లో భారీగా నీరు చేరి కెరటాలు కొడుతోంది. దాంతో అధికారులు సైతం ఆ పరిస్థితిని అధిగమించడానికి ఏం చేయాలో తెలియక అయోమయానికి గురవుతున్నారు. కాజ్‌వేలు, కల్వర్టుల పరిస్థితిని అధికారులు ప్రత్యక్షంగానే పరిశీలించారు. వరద తగ్గుముఖం పట్టే అవకాశమున్న దృష్ట్యా పన్నెండు మండలాల పరిధిలోని 34 లంక గ్రామాలకు చెందిన ప్రజలు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని విజ్ఞప్తి చేశారు. తాగునీటిని పడవలపై చేర వేస్తున్నారు.



కాట్రేనికోన(మ) చిర్రయానాం వద్ద నివేదిక పరిశీలిస్తున్న కలెక్టర్

3374 ఎకరాల్లో

వరి చేలు మునక

ముంపు ప్రాంతాలను పరిశీలించిన జేసీ నిషాంతి

పి.గన్నవరం, జూలై 25: జిల్లా వ్యాప్తంగా వరదలు కారణంగా 3,374 ఎకరాల్లో వరి చేలు నీటమునిగాయని జేసీ టి.నిషాంతి తెలిపారు. అలాగే 1462 హెక్టార్లలో ఉద్యాన పంటలు నీటమునిగాయని ఆమె వివరించారు. గంటిపెదపూడి శివారు బూరుగులంక నదీపాయను పరిశీలించి అనంతరం మాట్లాడారు. వరద తగ్గిన తర్వాత సంబంధిత అధికారులు ప్రభుత్వం ఆదేశాలమేరకు అంచనాలను రూపొందిస్తారని ఆమె స్పష్టం చేశారు. వరద ముంపు గ్రామాలలో జిల్లా వ్యాప్తంగా 60 చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామని ఆమె చెప్పారు. తాగునీటి ఇబ్బందులు ఉన్నచోట ఇప్పటి వరకు 2,631 వాటర్ టిన్నులు అందించామని చెప్పారు. పశువులకు అంటు వ్యాధులు ప్రబలకుండా పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వ్యాక్సిన్లు అందిస్తున్నామని, అత్యవసర వైద్య సేవలను అందుబాటులో ఉంచామన్నారు. పి.గన్నవరం, అల్లవరం, కాట్రేనికోన మండలాల్లో పలు వరద ముంపు గ్రామాల్లో ఆహార పొట్లాలు అందిస్తున్నామని చెప్పారు. అవసరమైతే మరిన్ని గ్రామాల్లో ఆహార పొట్లాలు అందించే ఏర్పాట్లు చేస్తామన్నారు. వరదలు కారణంగా లంక గ్రామాల ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని ముంపు బాధితులు భయాందోళనకు గురికావాల్సిన పనిలేదన్నారు. ప్రభుత్వ యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టిందన్నారు. అనంతరం ఏటిగట్టుపై నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ట్రాక్టర్‌లో కాజ్‌వేను దాటుకుని బూరుగులంక రేవు వద్దకు జేసీ చేరుకున్నారు. రేవు వద్ద అవతలి గ్రామాల వివరాలను తెలుసుకుని ఆర్డీవో జీవీవీ సత్యనారాయణను పడవల ఏర్పాటుపై ఆరా తీశారు. అంతకు ముందు పి.గన్నవరం అక్విడెక్టు కాల్వ తొట్టి వద్ద సాగునీరు, వరద ప్రవాహాన్ని పరిశీలించారు. జేసీ వెంట ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ, తహసీల్దార్ ఎస్‌కె హుస్సేన్, ఎంపీడీవో సీహెచ్ త్రిశూలపాణి, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఇన్‌చార్జ్ ఆర్‌ఐ పి.నరసింహారావు, ఇందుకూరి వీరభద్రరాజు, కె.శ్రీనివాసరావు, ఆనందరావు, బొరుసు సుబ్బరాజు, ఎం.నాయుడు, వీరమహిళలు ఏసుకుమారి, నల్లా గాయిత్రి ఉన్నారు.



పి.గన్నవరం: బూరుగులంక నదీపాయ వద్దకు ట్రాక్టర్‌పై వెళ్తున్న జేసీ నిషాంతి



రావులపాలెం: గోపాలపురంలో వరద నీటిలో ఉన్న మునగతోటలు



పి.గన్నవరం ఏటిగట్టుపై పశువులు

29 నుంచి విస్తృతంగా తనిఖీలు

వాహనదారుల వద్ద పత్రాలు లేకుంటే చర్యలే

జిల్లా రవాణా శాఖ అధికారి అశోక్‌ప్రతాప్‌రావు

అమలాపురం టౌన్, జూలై 25: జిల్లాలో ఈ నెల 29 నుంచి రవాణా శాఖ అధికారులు పూర్తిస్థాయిలో వాహనాల తనిఖీ చేపట్టనున్నట్లు జిల్లా రవాణా శాఖ అధికారి అశోక్‌ప్రతాప్‌రావు తెలిపారు. వాహనదారులు పూర్తి రికార్డులు, డ్రైవింగ్ లైసెన్సు, బీమా పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. లేనిపక్షంలో కేసుల నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రస్తుతం వరదలు, వర్షాల సీజన్ కావడంతో రహదారులు, కాల్వల, ఏటిగట్ల సమీపంలో రోడ్లపై ప్రయాణించేవారు జాగ్రత్తలు పాటించి వాహనాలు నెమ్మదిగా నడపాలన్నారు. రవాణాశాఖ వెబ్‌సైట్‌లో చెల్లించాల్సిన ట్యాక్సులు ముందుగానే చెల్లించుకోవాలని సూచించారు. ఆటోలు, బస్సుల్లో పరిమితికి మించి పిల్లలను ఎక్కించరాదని, స్కూల్ బస్సులపై యాజమాన్యాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు.

అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి హుండీల ఆదాయం
రూ.26.80 లక్షలు
7లో

అంగన్‌వాడీ హెల్పర్లకు పదోన్నతులు
కల్పించాలి
8లో



పి.గన్నవరం అక్విడెక్టు సమీపంలో రోడ్డుపై ప్రమాద సూచికను ఏర్పాటు చేసుకున్న స్థానికులు



పి.గన్నవరం-అమలాపురం రహదారి దుస్థితి

ఇక గుంతలు మాయం

రహదారుల గుంతల పూడ్చివేతకు అంచనాలు
జిల్లా వ్యాప్తంగా రూ.17.68 కోట్ల నిధులతో రూపకల్పన
అనుమతులు వస్తే...258 కిలోమీటర్ల మేర రోడ్లపై గుంతలు పూడ్చివేత

పి.గన్నవరం, జూలై 25: జిల్లా వ్యాప్తంగా రోడ్లకు మరమ్మతులు జరగనున్నాయి. అస్తవ్యస్తంగా అధ్వాన రీతిలో ఉన్న రోడ్లకు మళ్లీ మంచి రోజులు రానున్నాయి. గత ప్రభుత్వ హయాంలో రోడ్ల బాగోగులను పూర్తిగా విస్మరించడంతో రహదారులు అన్ని అస్తవ్యస్తంగా తయారయ్యాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని పలు రహదారులు మరింత దయనీయంగా మారి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కల్గిస్తున్నాయి. గుంతలకు తోడు వర్షం వస్తే ఇంతే సంగతులు వాహనదారులు నరకయాతన పడాల్సిందే. ఈ క్రమంలోనే కూటమి ప్రభుత్వం ముఖ్యంగా రోడ్లపై దృష్టి సారించింది. వర్షాకాలం కావడంతో పూర్తిస్థాయిలో రోడ్ల అభివృద్ధి సాధ్యం కాదని రాష్ట్ర వ్యాప్తంగా ప్రధాన రహదారులపై గుంతలను పూడ్చే కార్యక్రమానికి రూపకల్పన చేసింది. దీంతో జిల్లాల వారీగా అస్తవ్యస్తంగా ఉన్న రోడ్ల వివరాలను, అంచనాలను పంపించాలని ఆర్‌అండ్‌బీ అధికారులను సీఎం చంద్రబాబునాయుడు ఆదేశించారు. కోనసీమ జిల్లా వ్యాప్తంగా 258 కిలోమీటర్ల మేర రహదారులపై గుంతలు పూడ్చాలని గుర్తించారు. నియోజకవర్గాల వారీ అధికారులు రూపొందించిన అంచనాలను పరిశీలిస్తే...అమలాపురం నియోజక వర్గంలో 15 కిలోమీటర్లకు రహదారులకు రూ.70 లక్షలు, ముమ్మిడి వరం నియోజకవర్గంలో 17 కిలోమీటర్లకు రూ.1.44 కోట్లు, కొత్తపేట నియోజకవర్గంలో 45 కిలోమీటర్లకు రూ.2.50 కోట్లు, పి.గన్నవరం నియోజకవర్గంలో 40 కిలోమీటర్లకు రూ.4.64 కోట్లు, రామచంద్రపురం నియోజవర్గంలో 32 కిలోమీటర్లకు రూ.1.35 కోట్లు, మండపేట నియోజకవర్గంలో 41 కిలోమీటర్లకు రూ.1.95 కోట్లు, రాజోలు నియోజకవర్గంలో 66 కిలోమీటర్లకు రూ.5.10 కోట్లతో అంచనాలను రూపొందించి అధికారులు ప్రభుత్వానికి పంపించారు. ప్రభుత్వం నుంచి అనుమతులు వస్తే పనులు మొదలు పెడతారని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

మొగ తవ్వకంపై వివాదం

కలెక్టర్ సమక్షంలో రైతుల వాదులాట
ప్రస్తుతం మొగ తవ్వకాలు నిలిపివేసినట్లు ప్రకటన

ఉప్పలగుప్తం, జూలై 25: మొగ తవ్వకం వివాదాస్పదమైంది. రైతులు రెండు వర్గాలుగా విడిపోయి కలెక్టర్ సమక్షంలోనే ఘర్షణకు దిగారు. కూనవరం మొగ తవ్వకానికి గురువారం ముహూర్తం నిర్ణయించారు. తవ్వితే జరిగే నష్టాలపై ఎగువ రైతులు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించడంతో జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్ గురువారం మొగ ప్రాంతాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. తొలుత కలెక్టర్ కూనవరం మేజర్ డ్రెయిన్‌ను రాఘవులపేట వంతెన వద్ద నుంచి పరిశీలించారు. అంతకు ముందు వంతెనపై చేరుకున్న రైతులు రెండు వర్గాలుగా చీలిపోయి మొగ తవ్వకంపై ఘర్షణకు దిగారు. కలెక్టర్ రావడంతో ఆయనకు ఇరువర్గాలు తవ్వకానికి అనుకూలంగా, వ్యతిరేకంగా అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సమయంలో ఇరువర్గాల రైతులు ఘర్షణ పడ్డారు. అనంతరం కలెక్టర్ కూనవరం మొగ పరిశీలనకు వెళ్లారు. ఆయన మొగ సమీపంలోకి చేరుకోగానే రైతులు తమతమ వాదనలు విన్పించేందుకు పోటీపడ్డారు. మొగ తవ్వితే ఎస్.కొత్తపల్లి, రాఘవులపేట, వానపల్లిపాలెం, ఉప్పలగుప్తం, పేరాయిచెరువు, కూనవరం, వాడపర్రు, గొల్లవిల్లి, సన్నవిల్లి గ్రామాలకు ఉప్పునీటితో నష్టం జరుగుతుందని రైతులు కుచ్చర్లపాటి పెద్దిరాజు, ఆర్ఎస్ఎన్ కలెక్టర్‌కు వివరించారు. మొగకు బదులు పర్రలో ఇసుక మేటలు తొలగిస్తే ప్రయోజనముంటుందని అన్నారు. గతంలో జరిగిన పరిణామాలను వారు ఉదహరించారు. డ్రెయిన్ గట్లను పటిష్ఠం చేసి మొగ తవ్వితే అందరికీ లాభం జరుగుతుందని వ్యాఖ్యానించారు. మొగ తవ్వకపోతే తమ పొలాలు ముంపు నుంచి బయటపడే మార్గం లేదంటూ గోపవరం, భీమనపల్లి, భట్టుపాలెం, కిత్తనచెరువు రైతులు తమ కష్టాలను ఏకరువు పెట్టారు. మొగ తవ్వకపోతే తాము ఉపాధి కోల్పోతామంటూ మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేశారు. వందల సంఖ్యలో రైతులు మొగ వద్దకు చేరుకోవడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. డ్రెయిన్స్ డీఈఈ కిశోర్‌తో కలెక్టర్ మ్యాప్ ఆధారంగా కొద్దిసేపు చర్చించారు. ఇరువర్గాలతో మరోమారు మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని కలెక్టర్ రైతులకు చెప్పారు. ప్రస్తుతం మొగ తవ్వకాలు నిలిపివేసినట్టు డ్రెయిన్స్ డీఈఈ తెలిపారు. కోనసీమ రైతు పరిరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, నాయకులు పెమ్మిరెడ్డి సత్యనారాయణ, నల్లా బాబండి, నడింపల్లి సూర్యనారాయణరాజు, యాళ్ళ లక్ష్మీనారాయణ, మానే సత్తిబాబు, ఆకేటి బాబులు, తహసీల్దార్ మల్లికార్జునరావు, ఎంపీడీవో కొరారి వెంకటేశ్వరప్రసాద్ పాల్గొన్నారు.

అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్



సీఎస్సార్ నిధులతో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి

సంస్థలు ఉదారంగా నిధులు కేటాయించాలి
సదుపాయాల కల్పనకు తోడ్పడాలి
గ్రామాల డిమాండ్లను పరిశీలించాలి
ఓఎన్జీసీ ప్రతినిధులతో కలెక్టర్ భేటీ



ఓఎన్జీసీ ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం(ఆంధ్రజ్యోతి), జూలై 25 : జిల్లాలో చమురు, సహజవాయు సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రాంతాల్లో ఆయా గ్రామాల అభివృద్ధికి కార్పొరేట్ సామాజిక బాధ్యతా నిధులను అధికంగా కేటాయించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఓఎన్జీసీ అధికారులను కోరారు. కలెక్టరేట్‌లో గురువారం చమురు సహజ వాయువుల సంస్థ తూర్పు ప్రాంత ఆఫ్‌సోర్ ఎసెట్ ప్రతినిధులు, జిల్లా పంచాయతీ అధికారి, సీపీవోలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఓడలరేవు తదితర ప్రాంతాల్లో మూడు క్లస్టర్ల ద్వారా నిర్వహిస్తున్న కార్యకలాపాలను ఓఎన్జీసీ ప్రతినిధులు కలెక్టర్‌కు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ముడిచమురు, గ్యాస్, నీటి విభజన విధానం, పైపులైన్ల భద్రత, గోదావరి బేసిన్‌లో డ్రిల్లింగ్ ద్వారా చమురు వెలికితీత, డ్రిల్లింగ్ సమయంలో చేపల వేట కోల్పోయిన మత్స్యకారులకు జీవనభృతి కల్పించడం తదితర అంశాలను విశదీకరించారు. చమురు సంస్థ ఆయా గ్రామాల అభివృద్ధికి కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద నిధులు విడుదల చేసి మౌలిక సదుపాయాల కల్పనలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ నెల 30న ఓఎన్జీసీ కార్యకలాపాలపై జిల్లా కాలుష్య నియంత్రణ మండలి, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించి సీఎస్సార్ నిధుల కేటాయింపు అంశాలపై చర్చిస్తామన్నారు. ఓఎన్జీసీ నిక్షేపాలు వెలికితీస్తున్న గ్రామాల జాబితాను సిద్ధంచేసి ఆయా ప్రాంతాల ప్రజల డిమాండ్ అంశాలను సమర్పించాలని జిల్లా పంచాయతీ అధికారి బి.రాంబాబును కలెక్టర్ ఆదేశించారు. ఎస్టేట్ మేనేజర్, కార్యనిర్వాహక సంచాలకుడు రత్నేష్‌కుమార్, సీజీఎం మెకానికల్ నిర్మల్‌కుమార్, హెడ్ హెచ్ఎస్సీ మేనేజర్ భాస్కరరావు, హెచ్ఆర్ హెడ్ సునీల్‌కుమార్, ప్రొడక్షన్ జనరల్ మేనేజర్ ఎ.గుప్తా, సూపరింటెండెంట్ ఇంజనీర్ మురుగవేల్, సీనియర్ ఎగ్జిక్యూటివ్ సాదా బస్వర్, ఫణీంద్ర, నరేంద్ర, సీపీవో వెంకటేశ్వర్లు, డీపీవో రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కట్టె...



పట్టె...



తెచ్చె...



గోదావరి వరద ప్రవాహంలో విలువైన కలప కొట్టుకొస్తోంది.. వరద గోదావరిలో గత మూడు, నాలుగు రోజులుగా ఎక్కువగా కట్టెలు వస్తున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం వద్ద గోదావరిలో కొట్టుకొచ్చిన కట్టెలు, పుల్లలను పలువురు సేకరించి వాహనాలపై తరలిస్తున్నారు.

- మండపేట



జెన్‌కో కాలనీలో కొండ చిలువ కలకలం

మోతుగూడెం, జూలై 25: మోతుగూడెం లోయర్ సీలేరు ప్రాజెక్టు జెన్‌కో కాలనీ పోస్టాఫీసు వీధిలో పది అడుగుల కొండ చిలువ కలకలం సృష్టించింది. బుధవారం అర్ధరాత్రి కుంభోతగా వర్షం కురుస్తున్న సమయంలో పొట్టునూరి స్వర్ణ ఇంట్లో మంచం కింద చుట్టుకుని ఉన్న కొండ చిలువ కనిపించింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు భయాందోళనకు గురై చుట్టుపక్కల వాళ్లని పిలిచారు. ట్రాక్టరు డ్రైవరు చిన్నారావు ఆటో డ్రైవరు నాగకోన శంకరరావు కొండ చిలువను చాకచక్యంగా పట్టుకుని ప్లాస్టిక్ సంచిలో వేసి సమీపంలోని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

గోదావరి మరింత తగ్గుముఖం

- దవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ
- 13.40 అడుగులకు చేరిన నీటిమట్టం
- 12.27లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి

దవళేశ్వరం, జూలై 25: గోదావరి ఉధృతి క్రమంగా తగ్గుముఖం పడుతోంది. ధవళేశ్వరం వద్ద గురువారం ఉదయం 9 గంటలకు నీటిమట్టం 13.70 అడుగులకు తగ్గడంతో రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. ఈ సమయంలో 12,27,028 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది. నెమ్మదిగా తగ్గుతూ రాత్రి 7గంటల సమయానికి 13.40 అడుగులకు చేరుకుంది. 12,27,273 క్యూసెక్కులు బ్యారేజీ నుంచి దిగువకు ప్రవహిస్తోంది. ఎగువున భద్రాచలం వద్ద 45.20 అడుగుల వరకు తగ్గిన నీటిమట్టం ఇంద్రావతి నుంచి వస్తున్న వరద నీటితో 24 గంటల వ్యవధిలో మూడున్నర అడుగుల వరకు పెరిగి గురువారం సాయంత్రానికి 48.60 అడుగులుగా నమోదైంది. ప్రస్తుతం నిలకడగా కొనసాగుతుండగా ఇంద్రావతి నుంచి వచ్చే వరద నీరు తగ్గడంతో భద్రాచలం వద్ద నీటిమట్టం తగ్గుముఖం పట్టనుంది.

ఎగువున అన్ని ప్రాంతాల్లో నీటిమట్టం తగ్గుముఖం పడుతోంది. గురువారం సాయంత్రానికి కాళేశ్వరం వద్ద 11.07 మీటర్లు, పేరూరు వద్ద 16.33 మీటర్లు, దుమ్ముగూడెం వద్ద 13.20 మీటర్లు, భద్రాచలం వద్ద 48.60 అడుగులు, కూనవరం వద్ద 20.17 మీటర్లు, కుంట వద్ద 11.50 మీటర్లు,పోలవరం వద్ద 12.90 మీటర్లు, రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి వద్ద 16.62 మీటర్లుగా నీటిమట్టం నమోదయ్యింది.



బ్యారేజీ గేట్ల నుంచి దిగువకు ప్రవహిస్తున్న వరద నీరు





ఎజికొడేరులో వరద బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ దినేష్‌కుమార్, వరద నీటిలో వరరామచంద్రపురం మండలం శ్రీరామగిరి

నెమ్మదించిన శబరి

చింతూరు వద్ద నీటమట్టం 37 అడుగులు

చింతూరు, జులై 25: శబరి ఉధృతి నెమ్మదిగా తగ్గుతోంది. అల్లూరి సీతా రామరాజు జిల్లా చింతూరు వద్ద నీటిమట్టం గురువారం రాత్రికి 37 అడు గులకు చేరుకుంది. చింతూరు డివిజన్‌లోని వాగులు, వంకల్లో ఇంకా వరద నీరు ఉండడంతో రాకపోకలు సాగట్లేదు. దీంతో ఆయా ప్రాంతాల వాసులు నాటు పడవలపై ప్రయాణం చేస్తున్నారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం గురువారం సాయంత్రానికి తిరిగి 48.6 అడుగులకు చేరుకుని నిలకడగా ఉంది. దీంతో కూనవరం, వర రామచంద్రపురం మండలాల్లో గోదావరి ఎగపోటు ప్రభావం కన్పిస్తోంది. చింతూరు మండలం డొంకరాయి జల విద్యుత్ కేంద్రం రిజర్వాయరు నుంచి ఒక్క గేటు ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో ఆ నీరంతా శబరిలోకి చేరుతోంది. చింతూరు డివిజన్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో కలెక్టర్ దినేష్‌కుమార్ బృందం విస్తృతంగా పర్యటిస్తోంది. బాధితులకు అందుతున్న సహాయ సహకారాలపై నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు. బాధిత కుటుంబాలకు రేషన్‌తో పాటు కందిపప్పు, వంటనూనె, నిత్యావసరాలు అందజేస్తున్నారు.

మండలానికో ఐఏఎస్ అధికారి

చింతూరు డివిజన్లో 177 గ్రామాలు వరద ప్రభావితమయ్యాయి. బాధితులకు సహకారాలు అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన చింతూరు మండలంలోని ఎజికొడేరు, మల్లెతోట, ఉలుమూరు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చింతూరు డివిజన్లో వరద బాధితులకు సహాయ సహకారాలు అందజేసే విషయంలో పూర్తిస్థాయి పర్యవేక్షణ చేపట్టామన్నారు. ఇందులో భాగంగా ప్రతి మండలానికి ఒక్కో ఐఏఎస్‌ను నోడల్ అధికారిగా నియమించారన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే, రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య... మండలానికి ఒకరు వంతున పర్యవేక్షణ చేస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. వారికి తోడుగా చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా కూడా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిస్థితిని సమీక్షిస్తున్నారన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నారు.



డొంకరాయి జలాశయం నుంచి దిగువకు నీటిని వదిలిన దృశ్యం

పెరిగిన నీటిమట్టం

డొంకరాయి జలాశయం నుంచి 2173 క్యూసెక్కుల నీరు విడుదల

మోతుగూడెం, జూలై 25: విడవకుండా కురుస్తున్న వర్షాలకు డొంకరాయి జలాశయంలో నీటిమట్టం బుధవారం అర్ధరాత్రి 1036 అడుగులకు పెరిగింది. జెన్‌కో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఒక గేటును రెండు అడుగులు ఎత్తి 2,173 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశామని జెన్‌కో ఈఈ విజయ్ కుమార్ తెలిపారు. దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశామని, ఇన్‌ఫ్లోస్ తగ్గితే నీటి విడుదల నిలిపివేస్తామన్నారు.

ఏలేరు కాలువలో పడి వ్యక్తి మృతి



మృతుడు కాళహస్తి (పాత చిత్రం)

ఏలేశ్వరం, జూలై 25: ఏలేరు కాలువలో పడి మండలంలోని మర్రివీడు శివారుకు చెందిన ముంగర కాళహస్తి (57) మృతి చెందాడు. కాళహస్తి మర్రివీడు నుంచి ప్రాజెక్టుకు వెళ్లే కాలువలో చేపలు పట్టడానికి గురువారం దోనెపై వెళ్తుండగా నీటి ప్రవాహం, గాలికి అది హఠాత్తుగా నీటితో మునిగిపోయింది. సమీపాన ఉన్న గ్రామస్తుడు చంద్రయ్య ఇచ్చిన సమాచారం మేరకు కాలువలో గాలించినా ఆచూకీ తెలియలేదు. తన భర్త ఆచూకీ తెలియట్లేదని కాళహస్తి భార్య లక్ష్మి ఏలేశ్వరం పోలీసులకు సమాచారం అందించింది. దీంతో వారు గాలింపు చర్యలను ఉధృతం చేశారు. గురువారం సాయంత్రం నాలుగు గంటలకు కాలువ వద్ద మృతదేహం లభ్యమైంది. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.



హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి హుండీల ఆదాయం

రూ.26.80 లక్షలు

అయినవిల్లి, జూలై 25: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో హుండీలను దేవదాయ శాఖ జిల్లా అధికారి డి.నాగమల్లేశ్వరరావు, తనిఖీదారు జంపా రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో గురువారం తెరిచి కానుకలను లెక్కించారు. 63 రోజులకు ఆలయ ప్రధాన హుండీల ద్వారా రూ.25,70,643, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.1,09,702... మొత్తం రూ.26,80,345 ఆదాయం వచ్చింది. 11 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చాయి. లెక్కింపులో ముక్తేశ్వరం ఎస్‌బీఐ ప్రతినిధులు, అర్చకులు, దేవస్థానం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు టీటీడీ అధికారుల రాక

సత్యదేవుని ఆలయ శిఖరం స్వర్ణతాపడం అంచనాకు పరిశీలన

అన్నవరం, జూలై 25: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని ఆలయ శిఖరం స్వర్ణతాపడం చేయించాలనే ప్రతిపాదనకు దేవదాయ శాఖ కమిషనరు అనుమతి లభించిన సంగతి తెలిసిందే. అంచనాల కోసం టీటీడీ జ్యూయలరీ విభాగం అధికారులు శుక్రవారం పరిశీలన చేయనున్నారు. గతంలో ఒకసారి పరిశీలించగా సుమారు 11 కేజీల బంగారం పడుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు. అయితే పూర్తిస్థాయిలో నివేదికను శుక్రవారం తయారు చేసి కమిషనర్ అనుమతితో దాతల సహకారంతో దీనిని ఏర్పాటుచేయాలని ఆలోచన చేస్తున్నారు.

సీఐల బదిలీలకు రంగం సిద్ధం!

- మన్యం సహా కీలక స్థానాల కోసం ఎమ్మెల్యేల వద్ద పైరవీలు
- కొన్ని నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున సాగుతున్న బేరసారాలు
- ఆయా సీఐల గత చరిత్రను పరిశీలించాకే పోస్టింగ్

రంపచోడవరం, జూలై 25: రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో పోలీసు శాఖలో ఆయా రేంజ్‌లలో కీలకమైన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల బదిలీలకు రంగం సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఎమ్మెల్యేల వద్ద పైరవీలు మొదలయ్యాయి. మన్యంతో పాటు 19 నియోజకవర్గాల్లో అనేక స్టేషన్లు, సర్కిళ్లకు సీఐలను బదిలీ చేయడం అనివార్యం కానుంది. ఏ నియోజకవర్గంలో ఎవరుండాలన్న అంశంపై ఎమ్మెల్యేల కంటే ఆయా సీఐలకే ఎక్కువ క్లారిటీ ఉంది. వారు తమకు నచ్చిన స్థానం కోసం బేరసారాలు సాగిస్తూ దళారులతోను, నేరుగాను పావులు కదుపుతున్నారు.

కొందరు సీఐలను ఎన్నికల సంఘం నియమావళి మేరకు ఎన్నికలకు ముందే ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. వారంతా తిరిగి ఉమ్మడి తూర్పుతో ఏదో ఒక కీలక స్టేషనో, సర్కిలో లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. వైసీపీతో పూర్తిగా అంటకాగి కొందరు, గోడ మీద పిల్లి వాటంలా మరికొందరు ఉంటే అప్పటి ఎమ్మెల్యేలకు అనుకూలం కాక లూపు లైన్లలో ఇంకొందరు ఉండిపోయారు. ప్రభుత్వం ఏది ఉన్నా పైరవీలు సాగించడంలో చేయితిరిగిన సదరు సీఐలు ఇప్పుడు కూడా ముందు వరుసలోనే ఉన్నారు. మరికొందరైతే గతంలో ఆయా ప్రాంతాల్లో తమకు పరిచయం ఉన్న ద్వితీయ శ్రేణి నాయకత్వాలను దళారీలుగా ఉపయోగించుకుని పైరవీలు సాగిస్తున్నారు. కొన్నిచోట్ల ఆయా స్థానాలకు రేట్లు కూడా పలికాయి. కాకినాడ, రాజమహేంద్రవరం పరిధిలో 15 నుంచి 30 లకారాలకు పైగా పలికించి గిరాకీ పెంచారు. మరికొందరైతే తమకు వచ్చే వాటిలో కూడా వాటాలు చెల్లిస్తామన్న భరోసా కూడా ఇస్తున్నారు.

ఈ వ్యవహారాలు ఇలా సాగుతుండగా ఆయా రేంజ్ డీఐజీల ద్వారాను, హోం మంత్రి ద్వారాను ఎమ్మెల్యేల సిఫార్సులను అందుకుంటున్న ప్రభుత్వం ఈ అంశంలో కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చిన ప్రతి సిఫార్సులోని సీఐల గత చరిత్రను జిల్లాతో పరిచయం ఉన్న ఓ పోలీసు ఉన్నతాధికారితో పరిశీలన సాగించుకుని పర్వాలేదు అనుకున్న వారికి మాత్రమే పోస్టింగ్ ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. అంతే కాకుండా గత ప్రభుత్వంలో అకారణంగా పక్కనపెట్టబడిన వారిని కూడా పరిశీలనలోకి తీసుకుని ప్రాధాన్యమివ్వాలని చూస్తోంది.

రేపు, ఎల్లుండి ఎస్పీ బాలు స్వర స్మరణోత్సవం

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 25: ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలు స్వర స్మరణోత్సవాన్ని ఈ నెల 27, 28 తేదీల్లో విక్రమ హాల్లో నిర్వహిస్తున్నామని రాకా సంస్థ ప్రధాన కార్యదర్శి జి.రమణ తెలిపారు. రాజమహేంద్రవరం రాకా సాంస్కృతిక సంస్థ, ధవళేశ్వరం గోదావరి కల్చరల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో ఎస్పీ బాలు పాటల పోటీలు ఉంటాయని, బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. వివరాలకు 832805 9683, 91007 53156 నెంబర్లలో సంప్రదించాలన్నారు. సంగీత ప్రియులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

పేకాట శిబిరంపై పోలీసుల మెరుపుదాడి

14మంది అరెస్టు, రూ.77వేలు స్వాధీనం

మండపేట, జూలై 25: ఏడిద శివారు చింతాలమ్మ గుడి సమీపంలో దుళ్ల వెళ్లే రోడ్డులో ఉన్న వ్యవసాయ క్షేత్రాల్లో పేకాట శిబిరంపై గురువారం దాడి చేసినట్టు మండపేట రూరల్ సీఐ శ్రీధర్‌కుమార్ తెలిపారు. కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాలు, యానాం తదితర ప్రాంతాలకు చెందిన 14మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని రూ.77,260 స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ఘటనపై రూరల్ ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



అవినాష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సుధాలక్ష్మి

అంతర్జాతీయ చదరంగం పోటీలకు సాయిఅవినాష్ ఎంపిక

మామిడికుదురు, జూలై 25: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం మొగలికుదురు శ్రీచైతన్య స్కూలు విద్యార్థి పి.సాయిఅవినాష్ అంతర్జాతీయ స్థాయి చదరంగం పోటీలకు ఎంపికయ్యాడు. 8వ తరగతి చదువుతున్న అవినాష్ ఇటీవల పంజాబ్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ స్థాయిపోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ సుధాలక్ష్మి తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థిని శ్రీచైతన్య ఏజీఎం పార్థసారథి, ఆర్ఐ రాజ్‌కుమార్, అడకమిక్ కో-ఆర్డినేటర్ శ్రీకాంత్, డీన్ రమేష్ గురువారం అభినందించారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

11 సంవత్సరాల తర్వాత తుది తీర్పు ఇచ్చిన కోర్టు

జగ్గంపేట, జూలై 25: హత్య కేసులో నిందితుడైన జగ్గంపేటకు చెందిన వ్యక్తికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ గురువారం కోర్టు తీర్పునిచ్చింది. దీనికి సంబంధించి జగ్గంపేట పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 2013లో జగ్గంపేట శెట్టిబలిజపేటకు చెందిన వానశెట్టి సింహాచలం తన భార్య అక్రమ సంబంధం పెట్టుకుందన్న అనుమానంతో ఒక వ్యక్తిపై దాడి చేశాడు. అక్కడి నుంచి నేరుగా తన భార్య అక్రమ సంబంధానికి కారణమైన శెట్టిబలిజపేటకు చెందిన బత్తిన భవాని ఇంటికి వెళ్లాడు. ఆమె భోజనం చేస్తుండగా కల్లుగీసే కత్తితో నరికి చంపాడు. దీనిపై 2013లోనే జగ్గంపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి నుంచి దర్యాప్తు చేపట్టగా గురువారం కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. దాదాపు 11 సంవత్సరాల తర్వాత తుది తీర్పు వెలువరించింది. అయితే దర్యాప్తును నిర్ణీత సమయంలో పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేసిన అప్పటి సీఐ పి.భరత్‌మాతాజీ, డీఎస్పీ బి.సూర్యఅప్పారావు, ప్రస్తుత సీఐ ఎస్.లక్ష్మణరావు, పీపీ మృత్యుంజయరాజులను ఎస్పీ విక్రాంత్‌పాటిల్ అభినందించారు.

పీడీఎస్ బియ్యం కలిగిన 13 గొడౌన్లపై క్రిమినల్ కేసులు నమోదు

దర్యాప్తు చేస్తున్నామన్న కాకినాడ పోర్టు సీఐ సుమంత్

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 25: పీడీఎస్ బియ్యం కలిగి ఉన్న నేపథ్యంలో కాకినాడ జిల్లాలో 13 గొడౌన్ల యాజమాన్యాలపై పోలీసులు తాజాగా క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఎఫ్ఐఆర్ కట్టి దీనిపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ప్రధానంగా కాన్‌కోర్ బియ్యం గొడౌన్, ఎస్ఆర్ జ్యోతి, హెచ్ గొడౌన్, అశోకా ఇంటర్నేషనల్, సార్టెక్స్ ఇండియా, సాయితేజ షిప్పింగ్ సర్వీసెస్, విశ్వప్రియ ఎక్స్‌పోర్ట్స్, లావణ్య ఇంటర్నేషనల్, అయ్యప్ప ఎక్స్‌పోర్ట్స్, శ్రీనివాసా ట్రేడింగ్ అండ్‌కో, సరళ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, బ్లూఓషియన్ మెరైన్ ప్రైవేట్ లిమిటెడ్, సత్యం బాలాజీ రైస్ ఇండస్ట్రీలపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. పీడీఎస్ (కెర్నెల్స్) ఫోర్టిఫైడ్ బియ్యాన్ని రాష్ట్రంలో ఎక్కడెక్కడి నుంచి సేకరించారు, దీన్ని కాకినాడ పోర్టుకు ఎలా తరలిస్తున్నారు, తర్వాత ఇతర దేశాలకు ఎలా ఎగుమతి చేస్తున్నారు.. అనే కోణంలో దర్యాప్తు సాగుతున్నట్టు తెలిసింది. గత నెలలో చేసిన దాడుల్లో 50,647 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని అధికారులు సీజ్ చేశారు. ఇందులో 26,488 మెట్రిక్ టన్నుల బియ్యం కెర్నెల్స్ కలిగిన ఫోర్టిఫైడ్‌గా గుర్తించారు. 13 గొడౌన్ల యజమానులపై 6(ఎ) కేసులు నమోదు చేశారు. తాజాగా పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. గత ఐదేళ్లలో రూ.800కోట్ల పీడీఎస్ బియ్యం ఇతర దేశాలకు ఎగుమతి అయినట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో పీడీఎస్ బియ్యం సేకరణ ఎలా జరిగిందనే అంశంపై ఎక్కువగా దృష్టి కేంద్రీకరిస్తున్నారు. పైగా కాకినాడ యాంకరేజ్ పోర్టు, డీప్ వాటర్ పోర్టు, కుంభాభిషేకం వంటి ప్రాంతాల్లో చెక్‌పోస్టుల ఏర్పాటుపై అధికారులు సమాలోచనలు చేస్తున్నారు. పీడీఎస్ బియ్యం రవాణాను అడ్డుకునేందుకు చెక్‌పోస్టులు ఏర్పాటు అవుతున్నాయి. ఈ విషయమై కాకినాడ పోర్టు సీఐ సుమంత్‌ను సంప్రదించగా... పీడీఎస్ బియ్యం కలిగిన గొడౌన్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు..

● వరద నీటిలో ఇంకా వాణిజ్య పంటలు
● లంక గ్రామాల్లో పడవలపై రాకపోకలు
● వరద ప్రాంతాల్లో అధికారుల పర్యటన

ఆర్మ్డ్ రిజర్వ్డ్ జిల్లా కార్యాలయం పరిశీలన

అమలాపురంటౌన్, జూలై25: అమలాపురం సినిమారోడ్డులోని ఆర్మ్డ్ రిజర్వ్ జిల్లా కార్యాలయాన్ని ఎస్పీ బి.కృష్ణారావు గురువారం సందర్శించారు. ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసుల నుంచి ఎస్పీ గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఏఆర్ డీఎస్పీ పి.విజయసారథి ఆయనకు స్వాగతం పలికారు. ఆర్మ్డ్ రిజర్వ్ కార్యాలయంలోని వసతులను, ఇతర పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పట్టణ డీఎస్పీ కార్యాలయాన్ని పరిశీలించారు. అదనపు ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా, డీఎస్పీ మహేశ్వరరావు, రిజర్వు ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

వరద బాధితులకు సదుపాయాలు కల్పించండి



అంతర్వేది: లంక గ్రామాల వివరాలు తెలుసుకుంటున్న జేసీ నిషాంతి

అంతర్వేది, జూలై 25: వరద ప్రభావిత గ్రామాల్లో అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు సేవలు అందించాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అన్నారు. గురువారం అప్పనరామునిలంక, టేకిశెట్టిపాలెం వరద ప్రాంత గ్రామాల పరిస్థితిని ఆర్డీవో కేశవర్ధనరెడ్డితో కలిసి జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి గురువారం పరిశీలించారు. టేకిశెట్టిపాలెం వంతెన వద్దనున్న వైద్య శిబిరాన్ని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, వైద్యం వంటి సౌకర్యాలు సకాలంలో అందేలా చూడాలన్నారు. పడవలపై ప్రయాణించేటప్పుడు లైఫ్ జాకెట్లు ఉపయోగించి వరద బాధితులకు సేవలందించాలన్నారు. పడవల్లో పరిమితికి మించి ఎక్కించరాదని, గ్రామాల్లో పారిశుద్ధ్యం, విద్యుత్ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ప్రతీ ఇంటికీ రోజుకు 20లీటర్ల చొప్పున నీటిని అందిస్తున్నామని స్థానిక అధికారులు జేసీకి వివరించారు. అనంతరం తహసీల్దార్, ఎంపీడీవో, ప్రత్యేకాధికారి తదితరులతో మాట్లాడారు. అనంతరం ఆర్డీవో కేశవర్ధనరెడ్డి సఖినేటిపల్లి లాకోపేట, సఖినేటిపల్లిలంక ప్రాంతాల్లో పర్యటించారు. అక్కడిపరిస్థితులను అధికారులను అడిగి తెలుసుకుని పూర్తిస్థాయి సేవల్లో అధికారులు, సిబ్బంది పాల్గొనాలన్నారు. తహసీల్దార్ పెద్దిరాజు, ఎంపీడీవో సత్యనారాయణ, ఏపీవో నాగప్రసాద్, ఏవో నరసింహారావు, కార్యదర్శి గంగరాజు,ఎస్ఐ రాము, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వరద ప్రాంతాల్లో జేసీ పర్యటన

రాజోలు, జూలై 25: రాజోలులో వశిష్ఠ గోదావరి వరద ఉధృతిని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి గురువారం పరిశీలించారు. నున్నవారి బాడవ, మేకలపాలెం వద్ద ఏటిగట్టును ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ గోదావరి నది వరదల మూలంగా ముంపు ప్రభావిత ప్రాంతాల్లో బాధితులు ఎటువంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. అధికారులకు ఆమె పలు సూచనలు చేశారు. ఆమె వెంట సర్పంచ్ రేవు జ్యోతి, ఉపసర్పంచ్ పామర్తి రమణ, తహశీల్దార్ గోపాలకృష్ణ, సెక్రటరీ రెహమాన్ తదితరులు ఉన్నారు.

ప్రతిపాదనలు సిద్ధం చేయండి

మలికిపురం, జూలై 25: పెదతిప్ప అవుట్‌ఫాల్ స్లూయిస్ తలుపులు మరమ్మతులకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని హెడ్‌వర్క్స్ ఏఈని జాయింట్ కలెక్టర్ నిషాంతి ఆదేశించారు. గురువారం వరద ప్రాంతాల పరిశీలనలో భాగంగా రామరాజులంక, పెదతిప్ప అవుట్‌ఫాల్ స్లూయిస్‌ను ఆమె పరిశీలించారు. పలువురు రైతులు స్లూయిస్ తలుపులు సరిగా పనిచేయకపోవడం వల్ల గోదావరి నీరు వేపచెట్టు డ్రెయిన్‌లో పడి తద్వారా పంట కాల్వల నుంచి లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని, పంట నష్టం జరుగుతుందని జేసీ దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుతం వరదనీరు లీకవకుండా ఇసుక బస్తాలతో కట్టడి చేశామని హెడ్‌వర్క్స్ అధికారులు ఆమె దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎంపీ సత్యవాణి, ఆర్డీవో కేశవర్ధనరెడ్డి, తహసీల్దార్ అనితకుమారి, మేడిచర్ల రాము, స్థానిక రైతులు పాల్గొన్నారు.

ఇసుకను పారదర్శకంగా పంపిణీ చేయాలి

కొత్తపేట, జూలై 25: స్టాక్ పాయింట్‌లో ఉన్న ఇసుక నిల్వలను సిబ్బంది పారదర్శకంగా పంపిణీ చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పేర్కొన్నారు.గురువారం స్థానిక బోడిపాలెం వద్ద ఉన్న ఇసుక నిల్వలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పంపిణీ జరుగుతున్న తీరును, రికార్డులను పరిశీలించారు. ఎటువంటి అక్రమాలకు తావులేకుండా ఇసుక సరఫరాను సక్రమంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. ఇంకా మిగిలిన స్టాక్ నిల్వలను, లాగ్ పుస్తకాలను, రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో కొత్తపేట ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ, తహసీల్దారు జి.ఏలిషా, ఆర్ఐ కొప్పిశెట్టి ఏడుకొండలు ఉన్నారు.

ఇబ్బందులు లేకుండా చూడాలి

మామిడికుదురు, జూలై 25: వరద ప్రభావిత గ్రామాల్లో ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ నిషాంతి సూచించారు. గురువారం అప్పనపల్లి కాజ్‌వే వద్ద వరద పరిస్థితిని జేసీ పరిశీలించారు. అనంతరం స్థానిక అధికారులతో మాట్లాడుతూ లంకగ్రామాల్లోని ప్రజల స్థితిగతులు, వరద పరిస్థితులపై ఆరా తీశారు. బాధితులకు అవసరమైన వైద్య శిబిరాలను గ్రామాల్లో ఏర్పాటు చేశామన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఆర్డీవో కేశవర్ధనరెడ్డి, తహశీల్దార్ మేరికమ్మ, ఎస్ఐ పి.సురేష్, ఆర్ఐ ఎంఆర్ అలీ, వీఆర్వో నారాయణ ఉన్నారు.

స్వల్పంగా తగ్గిన వరద ఉధృతి

ముమ్మిడివరం, జూలై 25: వరద ఉధృతి తగ్గడంతో ముమ్మిడివరం మండలంలో లంక గ్రామాల్లో రెండు అడుగులు నీటిమట్టం తగ్గింది. గోదావరి ప్రవాహ వేగం కూడా తగ్గి నిలకడగా ప్రవహిస్తుంది. దీంతో లంక గ్రామాల్లో రోడ్లపై నుంచి ప్రవహించే వరదనీరు కొంత మేర తగ్గింది. రాణేలంక వివేకానంద వారధి నుంచి గురజాపులంక వెళ్లే సిమెంటు రోడ్డు కూనాలంక వద్ద, గురజాపులంక సమీపంలోను వరద ఉధృతి స్వల్పంగా తగ్గింది. రోడ్డుపై నుంచి ప్రవహించే వరదనీరు ఉధృతి తగ్గడంతో రోడ్డుపై రాకపోకలు సాగించేవారికి ఇబ్బందులు తొలగాయి. లంక భూములు, వాణిజ్య పంటలు ముంపు బారి నుంచి కొంతమేర బయటపడ్డాయి. లంకాఫ్ ఠాణేలంక, కూనాలంక, గురజాపులంక, లంకాఫ్ గేదెల్లంక, చింతపల్లిలంక, సలాదివారిపాలెం, లంకగ్రామాల లోతట్టు ప్రాంతాలు ఇంకా ముంపులోనే కొనసాగుతున్నాయి. వరద సహాయక ప్రత్యేకాధికారి ఎస్.మధుసూదన్, తహసీల్దార్ బి.శ్రీనునాయక్, రెవెన్యూ అధికారులు గ్రామాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. లంక వాసుల రాకపోకలకు ఏర్పాటుచేసిన ఇంజను బోట్లు, మూడు ఫైబర్ బోట్లు సిద్ధంగానే ఉన్నాయి. లంకాఫ్ ఠాణేలంకలో గుత్తాలవారిపేటలో గుత్తుల వెంకలక్ష్మికి చెందిన డాబావరద గోతకు గురైంది. ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ ఆధ్వర్యంలో ముంపు బాధితులకు రక్షిత మంచినీటి సరఫరా సాగిస్తున్నారు. ముంపు ప్రాంతాల్లో వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి.

తగ్గుతూ పెరుగుతున్న వరద

మామిడికుదురు, జూలై 25: గోదావరికి వరద తగ్గుతూ పెరుగుతుండడంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భద్రాచలంలో వరద నీటి మట్టం పెరుగుతుండడంతో పెదపట్నం, అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం గ్రామాల ప్రజలు భయాందోళనల మధ్య జీవిస్తున్నారు. లంక గ్రామాల్లో పశుగ్రాసం వరద నీటికి తడిసిపోవడంతో పశుగ్రాసం కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. లంక గ్రామాలు ఇంకా జలదిగ్బంధంలోనే ఉన్నాయి. అప్పనపల్లి బాల బాలాజీ దర్శనాలను నిలుపుదల చేశారు. ఇంకా నాలుగు రోజుల పాటు వరద కొనసాగే పరిస్థితి ఉండడంలో లంక గ్రామాల ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

సాగుతున్న పడవ ప్రయాణం

పి.గన్నవరం, జూలై25: గోదావరి ఎగువ ప్రాంతంలో గోదావరి వరద ఉధృతి తగ్గి మళ్లీ పెరగడంతో లంకగ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఎగువ నుంచి వచ్చే వరద స్వల్పంగా తగ్గడంతో ధవళేశ్వరం నుంచి దిగువకు సముద్రంలోకి తక్కువ నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో నదీపాయలు కొంతమేర శాంతించాయి. మండలంలో మానేపల్లి శివారు శివాయిలంక, గంటిపెదపూడి, ఉడిమూడి శివారు నాలుగు లంకగ్రామాల ప్రజలు ఇంకా పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. లంకలు మొత్తం పూర్తిస్థాయిలో నీట మునగడంతో పాడి రైతులు పశువులను ఏటిగట్లపైకి చేర్చారు. కొన్ని లంకగ్రామాల్లో ఎత్తు ప్రదేశాల్లో పశువులను ఉంచారు. పచ్చికబైళ్లు పూర్తిగా నీటమునగడంతో ప్రస్తుతం ఎండి గడ్డినే పశువులకు వేస్తున్నారు. వరద నీటిలో మునిగిన ఉద్యాన పంటలు, వాణిజ్య ఎంటలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లంక గ్రామాల్లో వైద్య శిబిరాలు, పశువైద్య శిబిరాలు, తాగునీటి పంపిణీ కొనసాగుతుంది. ప్రస్తుతం ఆహార పొట్లాలు కూడా పలు గ్రామాల్లో గురువారం నుంచి పంపిణీ ప్రారంభించినట్లు ఆర్డీవో జి.వి.వి.సత్యనారాయణ తెలిపారు.



మామిడికుదురు: వరద నీట మునిగిన పెదపట్నంలోని ఎస్సీ కాలనీకి వెళ్లే రహదారి

కొబ్బరి తోటల్లోకి వరద నీరు

అంబాజీపేట, జూలై 28: ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు దిగువ ప్రాంతంలో వరదనీరు పోటెత్తుతుంది. వైనతేయ గోదావరి ఉధృతంగా ప్రవహించడంతో మండలంలోని నదీతీర ప్రాంతాలు వాకలగురువు, తొండవరం, నందంపూడి గ్రామాల్లో పలు కాలనీలో కొబ్బరి, అరటి తోటల్లో వరద నీరు భారీగా చేరింది. అప్పర్‌కౌశికలు పొంగి ప్రవహిస్తున్నాయి. వాకలగరువు ఫిషర్‌మ్యాన్ కాలనీలో 20పడవలు, దోనె వేటకు వెళ్లకుండా ఒడ్డున నిలిపివేశారు. 150మత్స్యకార కుటుంబాలు వేటపై జీవనంసాగిస్తున్నాయి. వాకలగరువుప్రాంతానికి వరద నీరుచేరే అవకాశం ఉండటంతో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వైద్య సిబ్బంది మందులను పంపిణీ చేస్తున్నారు.

వరద ఉధృతిని పరిశీలించిన ఆర్డీవో

కె.గంగవరం, జూలై 25: వరదల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రామచంద్రపురం ఆర్డీవో సుధాసాగర్ అన్నారు. గురువారం కోటిపల్లిలోని వరద ఉధృతిని ఆయన పరిశీలించారు. కోటిపల్లి పుష్కరాల రేవులో, ఫెర్రీ రేవులో వరద నిలకడగా ఉంది. వరద తగ్గుముఖం పట్టిందని స్థానికులు ఆయనకు వివరించారు. స్థానిక మత్స్యకార కాలనీ మాధవ నగర్‌లో వరద నీటిలో చిక్కుకున్న ఇళ్లను ఆయన పరిశీలించి ప్రజలతో మాట్లాడారు. త్రాగునీరు గురించి ఆరా తీసారు. వారంరోజుల నుంచి ఉపాధి కోల్పోయామని, బియ్యం ఇప్పించాలని స్థానికులు కోరారు. ఈవిషయాన్ని ఉన్నతాధికా రులకు తెలియజేస్తానని ఆయన హామీ ఇచ్చారు. తహసీల్దార్ రవీంద్రనాథ్, వీఆర్వో సాయి, సర్పంచ్ పెమ్మాడి బేబి సత్తిబాబు, కూటమి నాయకులు పప్పుల సాయిబాబు, వెంటూరు వీర్రాఘవులు చౌదరి, గొడవర్తి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మెరక ప్రాంతానికి పశువుల తరలింపు

కపిలేశ్వరపురం, జూలై25: భద్రాచలం వద్ద గోదావరి వరద తగ్గుముఖం పట్టినప్పటికీ ధవళేశ్వరం వద్ద తగ్గుముఖం పట్టకపోవడంతో నదీపరివాహక ప్రాంతాలు తాతపూడి, కపిలేశ్వరపురం, కోరుమిల్లి, లంకగ్రామాలైన కేదార్లంక, వీధివారిలంక, నారాయణలంక, పల్లపులంక, అద్దంకివారిలంక గ్రామాల్లో వరద ఉధృతి కొనసాగుతుంది. లంక గ్రామాల్లోని కంద, అరటి, కూరగాయలపంటలు వరద నీటిలోనే ఉన్నాయి. లంక పొలాల్లోకి నీరు చేరడంతో పశువులను మెరక ప్రాంతాలకు తరలించారు. కోరుమిల్లి శివారు లాకుల సమీపంలో ఏటిగట్టు దిగువ భాగాల్లో కోతకు గురవడంతో ఇసుక బస్తాలతో తాత్కాలిక చర్యలు చేపడుతున్నారు. వరద ఉధృతి అధికంగా పెరిగితే ఇక్కడ పరిస్థితి ఏమిటని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు శాశ్వతచర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వరద ముంపులోనే పంట పొలాలు

కొత్తపేట, జూలై 25: వరద ముంపులోనే వాణిజ్య పంటలైన మునగ, బొప్పాయి, వంగ, దొండ, కూరపాదులు ముంపులోనే ఉండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా అరటి, మునగ, బొప్పాయి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, కూరపాదులు కూడా పూర్తిగా కుళ్లిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతికి అందివచ్చిన వంగపంట పూర్తిగా పాడవ్వడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

వరద నీటిలో అరటి, కంద పంటలు

ఆత్రేయపురం, జూలై 25: వరద ఉధృతి కొనసాగుతూనే ఉంది. లంక గ్రామాల్లో అరటి, కంద, కూరగాయల పంటలు నీటమునిగాయి. వాడపల్లిలంక, పిచ్చుకలంకలో ఉన్న నివాస కుటుంబాల వారు గుడారాలు వేసుకున్నారు. వివిధ పంటలు వరదల్లో కొట్టుకునిపోయాయి.

కొనసాగుతున్న వరద ఉధృతి

ఆలమూరు, జూలై 25: గోదావరి వరద ఉధృతి గురువారం కూడా కొనసాగింది. వరద కొద్దిగా తగ్గినప్పటికీ పంట భూముల్లో వరదనీరు అలాగే ఉంది. ఆలమూరు, జొన్నాడ, బడుగువానిలంక, మూలస్థానంవద్ద వరదఉధృతిగా ప్రవహిస్తోంది. వరద ఉధృతి గోదావరి ఎగువ ప్రాంతంలో తగ్గుముఖం పట్టడంతో గోదావరి మధ్యలో ఉన్న బడుగువానిలంక గ్రామానికి వరద ముంపు తప్పడంతో ప్రజలు ఊపిరిపీల్చుకుంటున్నారు. మూలస్థానం వద్ద తోకలంకలో వరదనీరు నిలకడగా ఉంది.

సముద్ర జలాల్లోకి ఉధృతంగా వరద నీరు

అల్లవరం, జూలై 25: వైనతేయ వరద ఉధృతంగా సముద్ర జలాల్లోకి దిగడంతో తీరం వెంబడి తగ్గుముఖం పట్టింది. బోడసకుర్రు, పల్లిపాలెంలో 40మంది మత్స్యకారుల ఇళ్లతో పాటు గోపాయిలంక, గోడి తదితర ప్రాంతాల్లో కొబ్బరితోటలు వరద నీటిలో ఉన్నాయి. తహసీల్దారు పి.సునీల్‌కుమార్ పడవపై వరద ప్రాంతంలో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. వైనతేయ వరద కారణంగా బోడసకుర్రులో జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారులకు పునరావాస కేంద్రంలో పాలు, అల్పాహారం, భోజనాలు అందచేస్తున్నామన్నారు. బోట్లు, గజఈతగాళ్ళు, లైఫ్ జాకెట్లు సిద్ధంగా ఉంచామని, వైద్య శిబిరం కొనసాగుతోందన్నారు.ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్, సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, ఈవోపీఆర్డీ ఎస్వీవీ సత్యనారాయణ, ఆర్ఐ దుర్గాశ్రీనివాస్, సింగంపల్లి దుర్గా శ్రీనివాస్‌తో పాటు కార్యదర్శులు, వీఆర్వోలు వరద బాధితుల సేవలో ఉన్నారు.

వరద నీటిలో లంక పొలాలు

రావులపాలెం, జూలై 25: గోదావరికి వరద నీరు పోటెత్తి ప్రవహించడంతో ఉద్యాన పంటలు వరద ముంపులో చిక్కుకున్నాయి. రావులపాలెం మండలంలోని గౌతమి, వశిష్ఠ పాయలలో వరద నీరు ప్రవహిస్తుండటంతో లంక పొలాలు నీటమునిగాయి. దీంతో మునగ, అరటి, వంగ, దొండ తదితర ఉద్యాన పంటలన్ని ముంపునీటిలో చిక్కుకున్నాయి.

అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థుల దత్తత

అమలాపురం రూరల్, జూలై 25: ఇంజనీరింగ్‌లో అత్యుత్తమ ర్యాంకులు సాధించి కళాశాలలో చేరిన విద్యార్థులను దత్తత తీసుకుని ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నట్టు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలల అధినేత బోనం కనకయ్య ప్రకటించారు. 5వేలలోపు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు బస్సు సదుపాయంలో పూర్తి రాయితీ కల్పించడంతో పాటు మరెన్నో సౌకర్యాలు అందజేస్తున్నట్టు తల్లిదండ్రుల సమక్షంలో హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రారంభోత్సవ కార్యక్రమం గురువారం తల్లిదండ్రుల సమక్షంలో నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజే రామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కనకయ్య మాట్లాడుతూ కళాశాలలో చదువుకున్న ఎందరో విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగాలు దక్కించుకున్నారని వివరించారు. తల్లిదండ్రులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి జక్కం వెంకటకృష్ణారావు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



అమలాపురం: ఇంజనీరింగ్ పుస్తకాలను అందజేస్తున్న బీవీసీ విద్యాసంస్థల అధినేత బోనం కనకయ్య

క్రమశిక్షణతో ఇంజనీరింగ్‌లో రాణించాలి

అల్లవరం, జూలై 25: ఇంజనీరింగ్ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఇతర రంగాల్లో రాణించాలని చెన్నైకు చెందిన టెక్నాలజీ రిక్యూటర్ ఎగ్జావేర్ అన్నారు. ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం తరగతుల విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా తల్లిదండ్రులు, విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. బీవీసీ విద్యాసంస్థల అధినేత బోనం కనకయ్య మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులు హాజరు తగ్గకుండా క్రమశిక్షణతో ఇష్టపడి చదవాలన్నారు. ఛైర్మన్ బోనం కృష్ణసతీష్, ప్రిన్సిపాల్ వీఎస్ఏ చంద్రమౌళి, డాక్టర్ ఏ.ప్రవీణ్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు. డాక్టరేట్‌లను సన్మానించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

రామేశ్వరం యాత్రకు ఆర్టీసీ స్పెషల్

ఆత్రేయపురం, జూలై 25: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ యాత్ర స్పెషల్ సౌకర్యం కల్పిస్తున్నట్లు డిపో మేనేజర్ కేడీఎంఎస్ కుమార్ తెలిపారు. గురువారం ఆత్రేయపురం బస్‌స్టేషన్‌లో ఆయన విలేకర్లతో మట్లాడుతూ రావులపాలెం డిపో నుంచి రామేశ్వరం ఏడు రోజులు సూపర్‌లగ్జరీ బస్సు ఏర్పాటు చేశామన్నారు. వచ్చే నెల 17న రావులపాలెం నుంచి బయలుదేరి కాణిపాకం, సిరిపురం, అరుణాచలం, శ్రీరంగం, జంబుకేశ్వరం, పళని, ఈశా ఫౌండేషన్, మధురై, రామేశ్వరం, ధనుష్‌కోటి, తంజావూర్, కాంచీపురం, శ్రీకాళహస్తి, విజయవాడ మీదుగా 24న రావులపాలెం చేరుతుందన్నారు. మనిషికి భోజనంతో కలిపి రూ.8500 టిక్కెట్టు ధరగా నిర్ణయించామన్నారు. వివరాలకు యాత్రికులు రావులపాలెం కాంప్లెక్స్‌లో సంప్రదించాలన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

కపిలేశ్వరపురం, జూలై 25: చోరీ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు అంగర ఎస్ఐ ఎ.పరదేశి తెలిపారు. ఈనెల23 రాత్రి టేకిలో శ్రీవెంకటేశ్వరస్వామి, మరిడమ్మ, వినాయక, దుర్గమ్మ, కాపుల రామాలయాల్లో హుండీలను పగలగొట్టి నగదు అపహరించుకుపోయాడు. పంచాయతీ కార్యదర్శి సాదనాల శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కె.గంగవరం మండలం తామరపల్లికి చెందిన రేవు శ్రీనివాస్(సాదేశ్రీనివాస్)ను కపిలేశ్వరపురం ఏటిగట్టు దోర్లమ్మ ఆలయం వద్ద అరెస్ట్ చేశామన్నారు. పామర్రు, మండపేట, రంగంపేట పోలీసు స్టేషన్ల పరిధిలో చోరీలకు గురైన రెండు ద్విచక్ర వాహనాలను, పలు ఆలయాల్లో అపహరించిన రూ.3,740 స్వాధీనం చేసుకుని ఆలమూరు కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్ఐ తెలిపారు.

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి



అంతర్వేది, జూలై 25: అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహస్వామి, నీలకంఠేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించిన వందల ఎకరాల్లో 17ఏళ్లగా పంటలు పండడంలేదని, చౌడు భూములుగా మారి కలుపు మొక్కలు పెరిగిపోయి పంటలు పండించలేకపోతున్నామని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కౌలు రైతుల సంఘ సమావేశంలో కౌలురైతులు మాట్లాడారు. గొంది కౌలు రైతు సంఘ సమావేశంలో సీపీఐ రాజోలు నియోజకవర్గ కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ పెయిర్ రెంటల్ కమిటీ శిస్తును నిర్ణయిస్తుందన్నారు. పెయిర్ రెంట్ కమిటీ కౌలు రైతులతో చర్చించకుండా ఏకపక్షంగా నోటీసులు ఇవ్వడం ఎంత వరకు సమంజసమని దేవాదాయశాఖ అధికారులను ప్రశ్నించారు. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి తరతరాలుగా బీడు భూములను అభివృద్ధి చేశామని, దేవస్థానానికి తగు విధంగా సహకరించి ఈ భూములు కాపాడుకుంటామని, ప్రజాప్రతినిధులను కలిసి తమ గోడు విన్నవించుకుంటామన్నారు. ఈప్రాంతంలో ఉండని కొంతమంది దేవస్థానం అధికారులను తప్పుదోవ పటిస్తున్నారన్నారు. రైతులు, దేవస్థానం అధికారులు ఎప్పుడు సమన్వయంతోనే ఉన్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లి బుజ్జిబాబు, రాష్ట్ర నాయకుడు చెల్లుబోయిన కేశవశెట్టి, నియోజకవర్గ కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్, దొండపాటి చిట్టిరాజు, గేదెల తిరుపతి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ హెల్పర్లకు పదోన్నతులు కల్పించాలి

అమలాపురం టౌన్, జూలై 25: జిల్లాలో అర్హులైన అంగన్‌వాడీ హెల్పర్లకు వెంటనే పదోన్నతులు కల్పించాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబీరాణి డిమాండ్ చేశారు. అమలాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీలతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 42రోజుల సమ్మె సందర్భంగా రాష్ట్ర అధికారులు ఇచ్చిన మినిట్స్ కాపీ ఆధారంగా వెంటనే జీవోలు విడుదల చేయాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలకు నాలుగు నెలలుగా కందిపప్పు అందడం లేదన్నారు. పనిచేయలని సెల్‌ఫోన్లు ఇచ్చి రోజుకొక కొత్త యాప్‌లను ఏర్పాటు చేయడాన్ని విమర్శించారు. అన్ని యాప్‌లు కలిపి ఒకే యాప్‌గా చేస్తామని అధికారులు ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణవేణి మాట్లాడుతూ జూలై నెలలో వేతనాలు పెంచుతామన్న అధికారుల హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు జరిపి వేతనాలు పెంచాలని విజ్ఞప్తి చేశారు. అంగన్‌వాడీలపై రాజకీయ వేదింపులు ఆపాలని, జిల్లాలోని అంగన్‌వాడీ యూనియన్ లీడర్లతో సమస్యల పరిష్కారానికి సమావేశం నిర్వహించాలని కోరారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరామ్, ప్రాజెక్టు అధ్యక్షురాలు కె.జయలక్ష్మి, పి.అమూల్య పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషిచేయాలి

కపిలేశ్వరపురం,జూలై25: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని జడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి దుర్గారావు అన్నారు. గురువారం కపిలేశ్వరపురం, అంగర జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు సాకా శీనివాస్, వాసా కోటేశ్వరరావు అధ్యక్షతన విద్యార్థులకు స్కూల్ కిట్స్ పంపిణీ జరిగింది. కపిలేశ్వరపురంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రముఖులు, హెచ్‌ఎంలు వి.శ్రీనివాస్, ఎ.రాజు పాల్గొన్నారు.

వరద ప్రాంతాల్లో బాధితులకు సేవలు

అంతర్వేది, జూలై 25: టేకిశెట్టిపాలెం, అప్పనరామునిలంక, లాకోపేట, సఖినేటిపల్లిలంక గ్రామాల్లో రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది సేవలు అందిస్తున్నారు. తాగునీరు, వైద్య సదుపాయాలు, పారిశుధ్యంపై దృష్టి సారించినట్టు తెలిపారు. అప్పనరామునిలంక, కొత్తలంక, ఓఎన్జీసీ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉన్న బాధితులకు సహాయక చర్యల్లో అధికారులతో పాటు స్థానిక జనసేన నాయకులు పాల్గొన్నారు. గుండుబోగుల పెదకాపు, ఉండపల్లి అంజి, తాడి మోహన్, కార్యదర్శి అడబాల గంగరాజు, ఏపీవో నాగప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్ పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	: ఆపరేషన్ రావణ
శ్రీలలిత	: పురుషోత్తముడు
శేఖర్ స్క్రీన్-1	: డార్లింగ్
శేఖర్ స్క్రీన్-2	: డెడ్ పూల్
రమా	: రాయన్
గణపతి	: హరోం హర
వెంకటపద్మావతిస్క్రీన్-1	: కల్కి
వెంకటపద్మావతి స్క్రీన్-2	: డెడ్ పూల్

ఆసుపత్రి అభివృద్ధికి మంత్రి హామీ

ఆలమూరు,జూలై 25: ఆలమూరు ప్రభుత్వాసుపత్రి అభివృద్ధికి సహకరిస్తానని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ హామీ ఇచ్చినట్లు కొత్తపేట నియోజకవర్గ బీజేపీఇన్‌చార్జ్ అత్తిలి సత్తిబాబుగౌడ్ తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో ఉన్న మంత్రిని గురువారంఆయన చాంబర్‌లో బీజేపీ నాయకులు సత్తిబాబు, రొంగలి గోపీశ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆలమూరు ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు పూర్తిస్థాయిలో ఉన్నప్పటికీ సరైన వైద్యసేవలు అందించడం లేదని దీంతో దూరం ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. ఆసుపత్రి పనితీరుపై దృష్టి పెట్టి ఆసుపత్రి అభివృద్ధికి సహకరిస్తానని మంత్రి చెప్పారని సత్తిబాబు విలేకర్లకు వివరించారు.



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న సత్తిబాబుగౌడ్

మురుగు కాల్వల్లో కలుపుమందు పిచికారీ

మండపేట, జూలై 25: మండలంలో ఉన్న తుల్యభాగ, గొడ్డుకాల్వలో పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూడు నివారణకు డ్రైనేజీ శాఖ చర్యలు చేపట్టింది. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు డ్రైన్లు పొంగి ప్రవహిస్తున్నాయి. డ్రైన్ల ద్వారా ముంపునీరు దిగేందుకు ఇబ్బందిగా మారింది. గుర్రపుడెక్క తొలగింపునకు అధికారులు చర్యలు చేపట్టారు. మండలంలోని తుల్యభాగ, గొడ్డు కాల్వల్లో తూడు నివారణకు కలుపుమందు పిచికారి చేస్తున్నారు.

పరుపులు, దిండ్లు అందజేత

మలికిపురం, జూలై 25: విశ్వేశ్వరాయపురంలో ఉన్న వృద్ధాశ్రమానికి బేతేలు ప్రార్థనా మందిరం పాస్టర్ తాడి సూర్యంబాబు-రూన్సీ దంపతులు రూ.60వేలు విలువైన పరుపులు,దిండ్లను వృద్ధులకుఅందజేశారు. వారి కుమారులు ప్రిన్సిప్రవీణ్, జీవన్‌లు, పాస్టర్ సమర్పణరావు, పారుపల్లి ఏసురత్నంపాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్‌ను కలిసిన శివబాబు



ముమ్మిడివరం, జూలై 25: అమరావతి సచివాలయంలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను టీడీపీ నాయకుడు కురసాల శివబాబు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. పవన్‌కల్యాణ్‌కు దుశ్శాలువా, పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలిపారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఉన్నారు.

సరిహద్దు తగదాలో అన్నదమ్ముల ఘర్షణ

ఆత్రేయపురం, జూలై 25: ఇంటి సరిహద్దు తగాదాలో అన్నదమ్ముల మధ్య ఘర్షణ తలెత్తింది. ఈఘర్షణలో తమ్ముడు అతని భార్య తీవ్రగాయాలపాలయ్యారు. దీనికి సంబంధించిన పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ర్యాలి మెర్లవీధికి చెందిన పువ్వల సత్యనారాయణ, రామకృష్ణ అన్నదమ్ములు కొన్నేళ్ల నుంచి ఇంటి సరిహద్దు తగదా కోర్టులో ఉంది. గురువారం మధ్యాహ్నం ఇంటి సరిహద్దు సిమెంట్ స్తంభం విషయంలో ఇద్దరు ఘర్షణకు దిగారు. ఈఘర్షణలో తమ్ముడు సత్యనారాయణను అన్న రామకృష్ణ, అతని భార్య, కుమారుడు తీవ్రంగా గాయపరిచారు. ఈఘర్షణలో సత్యనారాయణ భార్య గాయపడింది. కర్రలతో విచక్షణరహితంగా కొట్టి గాయపరచడంతో సత్యనారాయణ, అతని భార్య కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. అలాగే అన్న రామకృష్ణను గాయపరిచిన తమ్ముడి సత్యనారాయణపై మరో కేసు నమోదు చేశారు.

సమస్యలను వివరించా



పి.గన్నవరం, జూలై 25: పిగన్నవరం, అంబాజీపేట, అయినవిల్లి, మామిడికుదురు మండలాల్లో అస్తవ్యస్తంగా ఉన్న రహదారుల అభివృద్ధికి సహకరించాలని ఆర్ అండ్‌బీ మంత్రి బీసీ జనార్దనరెడ్డిని కోరినట్లు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ చెప్పారు. రహదారుల వివరాలను అందించానని మంత్రి సానుకూలంగా స్పందించి రహదారుల అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

లంక గ్రామాల ప్రజలను ఆదుకోవాలి

ముమ్మిడివరం, జూలై 25: వదరలతో నష్టపోయిన రైతులు, బాధితులను తక్షణం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు డిమాండు చేశారు. మండలంలో వరద ప్రభావిత ప్రాంతాలైన లంకాఫ్ ఠాణేలంక, గురజాపులంకల్లో సీపీఎం పార్టీ నాయకుల బృందం గురువారం పర్యటించింది. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేలు నష్టపరిహారం అందించాలన్నారు. కార్యక్రమంలో జి.దుర్గాప్రసాద్, పొలమూరి శ్రీనివాస్, డి.రాఘవులు, వి.మోహనరావు, వి.రాంబాబు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముమ్మిడివరం, జూలై 25: ముమ్మిడివరం 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. ముమ్మిడివరం టౌన్ ఫీడర్-1, 2, ఠాణేలంక, అయినాపురం, కొత్తలంక, అనాతవరం ఫీడర్లు, ఆర్‌డబ్ల్యుఎస్ ఫీడర్లపై ఉన్న అన్నిగ్రామాలకు శుక్రవారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

రాయవరం: చెల్లూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని రామచంద్రపురం డీఈఈ వై.విజయానంద్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో మెయింటినెన్స్ పనులు కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు చెల్లూరు, చింతలతోట, మాచవరం, పసలపూడి, వెంటూరు గ్రామాల్లో సరఫరా ఉండదన్నారు.

ఉప్పలగుప్తం: ఉప్పలగుప్తం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 33కేవీ ఉప్పలగుప్తం ఫీడర్ నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం8నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ ఎం.రవికుమార్, ఏఈ శ్రీహరి తెలిపారు. గొల్లవిల్లి కెనాల్‌రోడ్, భీమనపల్లి, నంగవరం, సూదాపాలెం, గుండంవారిపాలెం, మంచెంవారిపాలెం, భట్లుపాలెం, విలసవిల్లి, సింగరాయపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఆత్రేయపురం: ఆత్రేయపురం, అంకంపాలెం, పేరవరం విద్యుత్‌సబ్‌స్టేషన్‌లోని 33కేవీ విద్యుత్ మరమ్మతులు కారణంగా శుక్రవారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి

మామిడికుదురు, జూలై 25: విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు పేర్కొన్నారు. గురువారం స్టూడెంట్ కిట్లను మగటపల్లిలో నామన రాంబాబు, లూటుకుర్రులో అడబాల తాతకాపు పంపిణీ చేశారు. స్కూలు ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మొబైల్ ఆధార్ క్యాంపును పరిశీలించిన డీఎల్‌డీవో

రాయవరం, జూలై 25: సోమేశ్వరం, కురకాళ్లపల్లి గ్రామ సచివాలయాల్లో గురువారం నిర్వహించిన మొబైల్ ఆధార్ క్యాంప్‌ను డీఎల్‌డీవో ఎ.శాంతి పరిశీలించారు. ఆధార్ నమోదు ఏవిధంగా జరుగుతుందో ఆమె ఆరా తీశారు. మండలంలో ఈనెల23నుంచి 27వరకు మొబైల్ ఆధార్‌క్యాంప్‌లు 12 గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆమె వెంట ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి పల్లెటి వెంకటరత్నం సిబ్బంది ఉన్నారు.

రికార్డు రూమ్ తనిఖీ చేసిన ఆర్డీవో

రాయవరం, జూలై 25: స్థానిక తహశీల్దారు కార్యాలయంలో భూములు, రెవెన్యూ రికార్డులు భద్రపర్చిన గదిని గురువారం రామచంద్రపురం ఆర్డీవో ఎస్.సుధాసాగర్ తనిఖీచేశారు. రికార్డులు భద్రంగా ఉన్నాయా అనే అంశాన్ని ఆర్డీవో పరిశీలించారు. తహశీల్దారు కార్యాలయంలో రికార్డు రూంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ తహశీల్దారు జానకి రామయ్య, ఆర్ఐ పంపన రామారావు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కొత్తపేట,జూలై 25: అవిడి శివారు కట్టమ్మ కాలనీ లేఅవుట్‌లో పేకాట శిబిరంపై అడిషనల్ ఎస్ఐ జ్వాలా సాగర్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేశారు. ఏడుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.2350 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.అశోక్ తెలిపారు.

కార్గిల్ విజయోత్సవ ర్యాలీ

మండపేట, జూలై 25: మండపేటలో గురువారం బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో కార్గిల్ యుద్ధంలో మరణించిన యుద్ధవీరుల జ్ఞాపకార్థం విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా బస్టాండ్ వరకు ర్యాలీ సాగింది. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కె.సాయిరాం, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కె.సత్యనారాయణ, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరాలు

అంబాజీపేట, జూలై 25: తొండవరం, వాకలగురువు పంచాయతీ కార్యాలయాల వద్ద శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసిన్నట్లు సర్పంచ్ పేరాబత్తుల దొరబాబు తెలిపారు. రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి జిల్లా లీగల్ సర్వీసెస్ ఆథారిటీ అధ్యక్షుడు వి.నరేష్ పర్యవేక్షణలో శిబిరాలు నిర్వహిస్తామన్నారు.

తల్లికి వందనంతో చంద్రబాబుకు అభివందనం

అంబాజీపేట, జూలై25: తల్లికి వందనం పథకంలో ప్రతీ బిడ్డకు రూ.15వేలు అందిస్తామని మంత్రి నారా లోకేశ్ ప్రకటించడం అభినందనీయమని టీడీపీ నియోజకవర్గ కోకన్వీనర్, మాజీ ఎంపీపీ దాసరి వీరవెంకట సత్యనారాయణ అన్నారు. విద్యావ్యవస్థలో చంద్రబాబు సమూల మార్పులు తీసుకువచ్చి ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందిస్తారని డీవీ ఆశాభావం వ్యక్తం చేశారు.

బీజేపీ సభ్యత్వ నమోదులో చురుగ్గా పాల్గొనాలి

ద్రాక్షారామ, జూలై 25: ఆగస్టు 15నుంచి చేపట్టనున్న బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కార్యకర్తలు చురుగ్గా పాల్గొనాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు కోరారు. గురువారం ద్రాక్షారామ పైండావారి సత్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆకేటి శ్రీకృష్ణ ఆధ్వర్యంలో బీజేపీ సమావేశం జరిగింది. కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అధిక సంఖ్యలో నిధులు కేటాయించడంపై సమావేశం ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపింది. సమావేశంలో అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రిచిట్టిబాబు, ఎస్సీ మోర్చా నాయకుడు పలివెల రాజు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇళ్ల వెంకటేశ్వరరావు, యాండ్ర బుల్లబ్బులు పాల్గొన్నారు.

సమాజ హితం కోసం శివలింగాలు తయారీ

రాజోలు, జూలై 25: లోక కల్యాణార్థం సమాజ హితం కోసం అమెరికాలో ఉన్న కోడెల శివప్రసాద్ మిత్రబృందం కోటి పార్థీవ శివలింగాలు తయారు చేయాలని ప్రతీ గ్రామానికి పుట్టమట్టి మౌల్డ్స్‌ను పంపిస్తున్నారు. రాజోలు ఆర్య వైశ్య సంఘ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్-భవానీ దంపతులు వాసవీ వనితాక్లబ్, విశ్వహిందూపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో రాజోలు గ్రామ మహిళలు పది రోజుల నుంచి పది వేలు శివలింగాలు తయారు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు రాజానాగరత్నకుమార్, కాట్రు సతీష్, దిలీప్, నాగరత్నం, సుధా, సత్యవతి, చలువాది లక్ష్మి, వాసవి వనితాక్లబ్ అధ్యక్షురాలు జల్లి అన్నపూర్ణ, లక్కింశెట్టి నర్సాంబ, సిరం నాగమణి, పళ్లపోతు ప్రవల్లిక, కృష్ణవేణి, వెత్సా భ్రమరాంబ, ఆర్యవైశ్య మహిళలు తదితరులు పాల్గొన్నారు.